www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 జనవరి 2024
5
అన్నమయ్య

యుటిఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మున్నా జట్టు

ప్రజాశక్తి-పీలేరు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మున్నా జట్టు ఎంపికైంది. ఈ నెల 6వ తేదీ నుంచి జరిగిన టోర్నమెంటులో 20 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ లో మున్నా, కొత్తపేట జట్లు తలపడ్డాయి. శనివారం సాయంత్రానికి టోర్నమెంట్ ముగిసి మున్నా జట్టును విజేతగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆ జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.15,116, రన్నర్‌గా నిలిచిన కొత్తపేట జట్టుకు రూ.7,116లు ద్వితీయ బహుమతిగా జ్ఞాపికతో పాటు అందజేశారు. ఈ టోర్నమెంట్‌ను యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సుధాకర్ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడంలో సామాజిక స్పృహ కలిగిన సంఘంగా యుటిఎఫ్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని, యువత క్రీడల్లో రాణించి దేశ భవిష్యత్తుకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జిల్లా గౌరవ అధ్యక్షులు శివారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు అక్రం బాష, కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి సదాశివ రెడ్డి, మాజీ గౌరవ అధ్యక్షులు జి.రాధాకృష్ణ, వెంకటరమణ, చంగల్ రాయులు, శెట్టి సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, పోతయ్య, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గుంజీలు తీస్తూ వినూత్న నిరసన

- జగన్ మావయ్యా అంగన్వాడీలకు జీతాలు పెంచాలని చిన్నారుల ఆందోళన
- దీక్షా శిబిరాల వద్ద సంతకాల సేకరణ
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- 33వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వేతనాలు పెంచకుండా 'మేము పెంచినప్పుడు మాత్రమే మీరు తీసుకోవాలి' ప్రభుత్వ విధానం సరైంది కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.ఎ.రామాంజులు పేర్కొన్నారు. శనివారం అంగన్వాడీల సమ్మె 33వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో టెంట్‌లో అంగన్వాడీలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి అంగన్వాడీలు కేవలం లక్షమంది ఉన్నారని, వారు 5 కోట్ల మందిలో కేవలం లక్షమంది ఉన్నారని, ఓటు వేస్తే ఎంత వేయకపోతే ఎంత అని పేర్కొడనం తగదన్నారు. మహిళలను గౌరవం కూడా లేకుండా తూలనాడడం ప్రభుత్వం పతనానికి నాంది అని తెలిపారు. ఆరుసార్లు చర్చలకు పిలిచి ఎస్మా ప్రయోగించి చివరికి తమ అనుచరులు, సూపర్‌వైజర్ల ద్వారా బెదిరిస్తే సమ్మె విరమించరని అంగన్వాడీలు సమ్మె మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు సంతకాల సేకరణ పేరుతో కోటి మందితో సంతకాలు సేకరించి జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజానీకంతో పాటు అన్ని వర్గాల సహకారం కోరతామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దమ్మ, భాగ్యలక్ష్మి, బంగారుపాప, ఖాజాబి, విజయమ్మ, అరుణ, సరస్వతి, సమలత పాల్గొన్నారు.

మదనపల్లి: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసినందుకు నిరసనగా గుంజీలు తీస్తూ 33వ రోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు హరింద్రనాథ్ శర్మ, నాయకులు మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూ 33 రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఈ సమ్మెలో 33వ రోజు అంగన్వాడీలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో తాము విధులు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం అన్నిరకాల ధరలు అమాంతం పెరిగిపో యాయన్నారు. ప్రభుత్వం గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం అమలు చేయాలని, గ్రాట్యూటి అమలు చేయాలని, ఇతర న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

లక్కిరెడ్డిపల్లి : జగన్ మామయ్య మా అంగన్వాడీలకు జీతాలు పెంచాలని అంగన్వాడీ సెంటర్ పిల్లలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల పిల్లలు సమ్మెలో పాల్గొని చేతులెత్తి నమస్కరించి జగన్ మామయ్య మేము మా ఇళ్లల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం మా అంగన్వాడీల వేతనాలు పెంచి సమస్యలు పరిష్క రించాలని కోరుకుంటున్నామని వారు నినదించారు. 33 రోజులుగా మమ్మల్ని ఇంటి వద్ద వదిలేసి ప్రతిరోజూ అమ్మలు ధర్నాలో కూర్చుంటున్నారు, దయచేసి వీరికి కనీస వేతనంతో పాటు వారి డిమాండ్లు పరిష్కరించాలని జగన్మామైన కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి, కార్యదర్శి ప్రభావతమ్మ, యూనియన్ సెక్టార్ లక్ష్మీదేవి, ఇరగమ్మ, నాగమణి, నాగవేణి, శ్రీవాణి, శిరీష, మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మదనపల్లె : గుంజీలు తీస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

లక్కిరెడ్డిపల్లె : జగన్‌కు దండాలు పెడుతున్న చిన్నపిల్లలు, అంగన్వాడీలు

రాయచోటి : కోటి సంతకాల సేకరణలో అంగన్వాడీలు

పల్లెబాట

పట్టణం పల్లెబాట పట్టింది. తెలుగింటి పెద్ద పండుగ సంక్రాంతి. ఇటువంటి ప్రాకృతిక, సాంస్కృతిక పండుగను ఇంటిల్లిపాదీ జరుపుకోనుండడంతో పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా ఖాళీ కావడం పరిపాటి. దేశంలోని ప్రధాన పట్టణాలు, నగర ప్రజానీకం గ్రామ సీమలకు పరుగుపెడుతోంది. ఆంధ్రుల అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఎన్నో ప్రాకృతిక మార్పులతో కూడిన పర్వదినం తరాల తరబడి సంప్రదాయంగా వస్తోంది. నవంబర్, డిసెంబర్ నెలల నుంచే ప్రజానీకం బస్సులు, రైళ్లు, విమాన రిజర్వేషన్లు చేసుకోవడం తెలిసిందే.

- నేటి నుంచి సం'క్రాంతి'!
- 550 ఆర్టీసీ బస్సుల కేటాయింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సంక్రాంతి లక్ష్మీ పరుగులు పెడుతోంది. ఉమ్మడి జిల్లాలోని 4,444 గ్రామ సీమలకు నిండుదనాన్ని చేకూర్చింది. తెలుగింట పెద్ద పండుగ కావడంతో దేశంలోని పలు పట్టణాలు, నగరాలు ఖాళీ అవుతున్నా యి. ఈనెల 11 నుంచి పాఠశాలలు సెలవులు ప్రకటించడంతో పట్టణాలు, నగరాల్లోని ఉంటున్న గ్రామీణుల పిల్లలు, ఆత్మీయులు క్రమంగా పల్లెబాట పట్టారు. దేశంలోని ప్రధాన నగరాలైన చెన్నయ్, బెంగళూరు, ముంబయ్, హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాల నుంచి పలువురు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. జిల్లా కేంద్రాల్లో ఉంటున్న ఉద్యోగులకు రెండవ శనివారం కూడా కలిసి రావడంతో గ్రామాలకు బయల్దేరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో గ్రామీణుల పిల్లలు సాఫ్ట్‌వేర్లు, ఇంజినీర్, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, వివిధ రకాల ఉద్యోగాల్లో ఉంటున్నారు. అందరికీ సంక్రాంతి ప్రధాన పండుగ కావడంతో బస్సులు, రైళ్లు, ఇతర ప్రయివేటు వాహనాలన్నీ రద్దీగా మారాయి. జిల్లాలో జూన్ నుంచి జనవరి వరకు వర్షాభావం కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా రైతన్నలు ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా కనిపిస్తోంది.

జిల్లా ప్రజారవాణా సంస్థ (ఆర్టీసీ) సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 500 సర్వీసులను నడుపుతోంది. ఈ నెల నుంచి 17వ తేదీ వరకు ఆర్టీసీ రాకపోకల షెడ్యూల్‌ను ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ ప్రకటించారు. అయితే ఈదఫా ఛార్జీల పెంపు లేకపోవడం ఊరటను కలిగిస్తోంది. 550 బస్సులతో సంక్రాంతి పండుగకు రావడానికి ఉద్దేశించిన ప్రణాళికకు రూపకల్పన చేశారు. ఇందులో 190 సూపర్‌లగ్జరీ, 05 ఇంద్రా, 35 అల్ట్రా డీలక్స్, 10 ఎక్స్‌ప్రెస్ బస్సులను సాధారణ ఛార్జీలతోనే నడు పుతున్నాం. ఇందులోని 90 బస్సులు హైదరాబాద్, 80 బెంగళూరు, 30 విజయవాడ, 10 చెన్నయ్, 30 ఇతర బస్సు సర్వీసులను నడుపుతున్నారు. ఆన్‌లైన్ డిమాండ్ ఆధారంగా అదనపు బస్సులను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు తిరుపతి, నెల్లూరు, కర్నూలు వంటి అంతర్ జిల్లాలకు అదనపు సర్వీసులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌గా పశ్చిమగోదావరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య 68వ జయంతి సందర్భంగా ఆయన కుమారులలైన జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఛైర్మన్ పసుపులేటి వీర ప్రదీప్ కుమార్, ఆర్గనైజ్ సెక్రెటరీ వీర పవన్ కుమార్ పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజంపేట మండలం తాళ్లపాక రోడ్డులోని శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్ర, శనివారాలలో నిర్వహించిన 45వ రాష్ట్ర స్థాయి బాలికల అండర్-19 హాండ్ బాల్ పోటీలలో ఛాంపియన్‌గా పశ్చిమగోదావరి నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయస్థానం, కర్నూలు జట్టు మూడో స్థానంలో నిలిచి కప్పులతో పాటు పథకాలను కైవసం చేసుకున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 12 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. వీరందరికీ పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాన్వి పాఠశాలలో భోజన, రవాణా వసతి కల్పించారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు స్టేట్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ రామాంజనేయులు, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ ఎస్.చంద్రశేఖర రావు, రిఫ్రీస్ బోర్డు ఛైర్మన్ ఎం.సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బ్రహ్మయ్య కుమారులు ప్రదీప్, పవణ్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, డాక్టర్ సి.సుధాకర్ చేతుల మీదుగా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను అందజేశారు. ఈ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన వెస్ట్ గోదావరి బీహార్ రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భరత్‌కుమార్ రాజు, ప్రిన్సిపల్ విజయనిర్మల, జయరాం, శ్రీనిధి, ప్రభాకర్ పాల్గొన్నారు.

గెలుపొందిన జట్టుతో ప్రదీప్ కుమార్, పవన్ కుమార్

చంద్రబాబు సభను జయప్రదం చేయండి : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో జరగనున్న రా.. కదలిరా... చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాటు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమా ర్‌రెడ్డి నాయకులకు తెలిపారు. శనివారం ఆయన పీలేరు ప్రాంతంలో 24న జరగనున్న రా కదలిరా చంద్రబాబు సభ ప్రాంగణ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమ విజయవంతం కోసం కిషోర్ కుమార్ రెడ్డి గత వారం రోజులుగా నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో పర్యటించి సభాసమావేశాలు నిర్వహించారు. ఇక ప్రతి సంవత్సరంలాగే 14, 15, 16వ తేదీల్లో సంక్రాంతి పండుగ రావడంతో అందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని అందరినీ ఆకాంక్షించారు. అనంతరం 17న పీలేరు మండల నాయకులు, కార్యకర్తలతో ఉదయం పది నుండి సాయంత్రం నాలుగు వరకు గ్రామీణ, పట్టణ నాయకులతో పలు ప్రాంతాల నుండి ప్రజలు, కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం అందించారు. ఏది ఏమైనా పీలేరులో చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టే కార్యక్రమం కావడంతో సభ విజయవంతం బాధ్యత కిషోర్ కుమార్ రెడ్డిపై ఉంది. కార్యక్రమంలో పీలేరు మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు అమర నాద రెడ్డి, వాల్మీకీపురం నాయకులు నిరంజన్ రెడ్డి, పీలేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మహేంద్ర రెడ్డి, నియోజకవర్గ బిసి అధ్యక్షులు వసంతల రాజా తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్నకిషోర్‌కుమార్‌రెడ్డి

కెకె.రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం : ఎంపిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్ఆర్ఐ కెకె.రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చిన్నపరెడ్డి, ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి అన్నారు. మన్నూరు రామలక్ష్మమ్మ, నారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పెద్దకారంపల్లి పంచాయతీలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని చుట్టుపక్కల ఉన్న 13 పల్లెల నిరుపేదలకు ఖరీదైన చీరలు, పంచలు, చిన్నపిల్లలకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది డబ్బులు సంపాదిస్తారే కానీ ఖర్చు పెట్టేందుకు ఆసక్తి చూపరన్నారు. కెకె.రెడ్డి జన్మనిచ్చిన సొంతూరి రుణం తీర్చుకునేందుకు తాను అమెరికాలో ఉంటూ సంపాదించిన సొమ్ముతో ప్రతి సంవత్సరం పేద ప్రజల కోసం సంక్రాంతికి దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఒకవైపు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే మరోవైపు ఆధ్యాత్మికంగా ప్రజల్లో భక్తి భావనను పెంపొందించేందుకు దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా తన తల్లిదండ్రుల ఫౌండేషన్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం వీడియో కాల్ ద్వారా కెకె.రెడ్డి పెద్ద కారంపల్లి ప్రజలకు ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకరంపల్లి పంచాయతీలో ఉన్నటువంటి నిరుపేద ప్రజలకు తమ ఫౌండేషన్ ద్వారా రానున్న రోజుల్లో మరెన్నో నిరంతర సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్లా, రాఘవేంద్ర వర్మ, ఎస్ఎండి బాష, పంతుల పవన్ కుమార్, కొండూరు జనార్దన్ రాజు, కుటుంబ సభ్యులు మన్నూరు వెంకటసుబ్బారెడ్డి, శుభోద్ రెడ్డి నారాయణరెడ్డి, అశోక్ రెడ్డి, శివరామిరెడ్డి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంగన్‌'వేడి' ప్రజా'దృష్టి'

అంగన్వాడీ ఉద్యమం వేడెక్కుతోంది. కడప, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ల ఎదుట గతంలో ఎన్నడూ లేని విధంగా సడలని పట్టుదలతో ఉద్యమాన్ని పతాకస్థాయికి చేరుకుంది. 33 రోజులుగా కొత్త సంవత్సరం, సక్రాంతి వంటి పండుగలను సైతం లెక్కచేయకుండా ఉద్యమం రోజురోజుకూ కొత్తశిఖరాలకు చేరుకుంటోంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారనే కనికరం లేకుండా ఎస్మాస్త్రాలను ప్రయోగించినా పట్టువదలని పోరాటం అనన్య సామాన్యమని చెప్పాలి. ఇటువంటి గట్టి పట్టుదలకు పోరాడితేనే ప్రభుత్వాలు కళ్లు తెరిచే అవకాశం ఉందని చెప్పవచ్చు. లేకపోతే భవిష్యత్ పోరాటాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట భయపడి లొంగిపోతే భవిష్యత్ పోరాటాలు చేయడానికి అవకాశం ఉండదనే సంగతిని గుర్తెరగాల్సి ఉంది. పోరాట నాయకత్వాలు సైతం పట్టువదలని పోరుబాటను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంగన్వాడీలు పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతున్న న్యాయమైన డిమాండ్లను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మినీ అంగన్వాడీల అప్‌గ్రేడేషన్ నుంచి సమాన పనికి సమాన వేతనం, అంగన్వాడీ సెంటర్ల అద్దె చెల్లింపులు వంటి న్యాయమైన డిమాండ్లను విస్మరించలేనివి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వంటి డిమాండ్లను సానుకూల దృక్పథంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి సహజ న్యాయ సూత్రాలను సానుకూల దృక్పథంతో పరిశీలన చేయకుండా, అణచివేత ధోరణికి ఎంచుకోవడం, ఎస్మాస్త్రం వంటి ప్రయోగాలు చేయడం, నోటీసులు ఇవ్వడం, విధుల్లో చేరాలని హుకూంలు జారీచేయడం నియంతృత్వానికి నిదర్శనం. ఇటువంటి పెత్తందారీ పోకడలను డౌన్ ట్రెండ్‌పై ప్రయోగించాలనుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. అంగన్వాడీలు, ఆశాలేమీ గొంతెమ్మ కోర్కెలను కోరడం లేదు. పొరుగు రాష్ట్రం తెలంగాణ కంటే రూ.వెయ్యి అధికంగా చెల్లిస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరడం మినహా మరేమీ లేదు. సార్వత్రిక ఎన్నికల ముంగిట ఇటువంటి అహంకార పూరిత ధోరణి ప్రదర్శిస్తున్న ప్రభుత్వం సాధారణ రోజుల్లో ఎటువంటి నియంతృత్వ ధోరణిని ప్రదర్శించేదో అర్థం చేసుకోవాల్సి ఉంది. అంగన్వాడీల ఆందోళన కారణంగా తల్లీబిడ్డల ఆరోగ్యం దగ్గర నుంచి అన్ని రకాల సేవలు నిలిచిపోవ డంతో సమాజం అతలాకుతలమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించాల్సిన అవసరం ఉరుముతోంది. లేనిపక్షంలో సంక్షేమ పథకాల పేరుతో ఇంతకాలం చేసిన శ్రమ వృథాగా మారిపోయే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ప్రభుత్వ సంక్షేమ వ్యయంపై ఎక్కుపెట్టిన బాణాలు సైతం తగిలే అవకాశం ఉందని గ్రహించాల్సిన అవసరం ఉంది. పట్టువిడుపుల ధోరణితో సమయానికి తగిన విధంగా ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించకుండా అహంకారాన్ని ప్రదర్శిస్తే సార్వత్రిక ఎన్నికల్లో భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందనే వాస్తవాన్ని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

భగ్గుమంటున్న ధరలు

- ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- మధ్య తరగతి కుటుంబాల్లో కనపడని పండుగలు
- ధరలు నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - రాయచోటి

పెరిగిన నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య మధ్య తరగతి కుటుంబాలు పండుగలు జరుపుకొనే పరిస్థితిలో లేకుండా పోయింది. ముఖ్యంగా ధరల నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పలు ప్రజా సంఘాలు, నాయకులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ అంటే తెలుగింటివారికి పెద్ద పండుగ. సంక్రాంతి పండుగ అంటే పట్టణాల్లో నివసించే వారు కూడా సొంత గ్రామాలకు వచ్చి అక్కడ నాలుగు రోజులు పాటు బంధుమిత్రులు కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగలు జరుపుకుంటారు. హైదరాబాదు, బెంగళూరు, విశాఖ, విజయవాడ, సుదూర ప్రాంతాల నుంచి ఉద్యోగ నిమిత్తమై వెళ్లిన వారు కూడా గ్రామాలకు వస్తుంటారు. ఇక గల్ఫ్ ప్రాంతాల్లో ఉండే వారు కూడా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని భావిస్తారు. ఈ పండుగలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులలు అమాంతంగా కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసరాల ధరలను ఒక్కసారిగా పెంచేసి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు.



ఆకాశానంటిన నిత్యావసర సరుకులు..: గతంలో కందిపప్పు రూ.125 ఉండగా నేడు రూ.175 చేరుకుంది. పెసరపప్పు కిలో రూ.130, వట్టి మిరపకాయలు రూ.300, యర్ర గడ్డలు రూ.40, తెల్లగడ్డలు రూ.370, శనగపప్పు రూ.140, మినపప్పు రూ.130, గోధుమపిండి రూ.55, బెల్లం రూ.60, పంచదార రూ.45, చింతపండు రూ.380, కారం రూ.300, సన్ ఫ్లవర్ రిఫైనరీ రూ.140, పామాయిల్ రూ.120, వేరుశనగనూనె రూ.140 ఇలా నిత్యావసర ధరలు ఆకాశానంటాయి.

కూరగాయలు...: పచ్చి బఠాణీ కాయలు రూ.20/250 గ్రాములు, సొరకాయ రూ. 50, బీర కాయలు రూ.70, నిమ్మకాయలు 4/10 రూపాయలు, టమోటా కిలో రూ.30, మిరపకాయ కిలో రూ.70, బజ్జీ మిరప కిలో రూ.40, వంకాయ కిలో రూ.60, బెండ కిలో రూ.60, మటిక రూ.70, దొండ రూ.60, కాకర రూ.60, మునగ 250 గ్రాములు రూ.30, ఆనపకాయ రూ80, నాటు అలసంద రూ.80, చిక్కుడు కిలో రూ.80, బీట్రూట్ రూ. 50, క్యారెట్ రూ.70, ముల్లంగి రూ.60, ఆలు గడ్డ దుంపలు రూ.40, అల్లం రూ.180, క్యాప్సికమ్ రూ.60, బీన్స్ రూ.80, కీర కాయలు రూ.30, క్యాబేజీ రూ.30, కాలిఫ్లవర్ రూ.40 అమ్ముతున్నారు.

ఆకుకూరలు.. : కొత్తిమిర కట్ట రూ.20, పాలాకు రూ.20, చుక్కాకు రూ.25, సిర్రాకూ రూ.25, మెంతి ఆకు రూ.5, పొదిన రూ.10, ఎరుపు గోగాకు రూ.10, కోయటాకు రూ.1, కరివేపాకు రూ.10 అమ్ముతున్నారు. గ్యాస్ వంట నూనెల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. సంక్రాంతి పండుగ అంటేనే ఇళ్లల్లో వంటతో మొదలు పెడతారు. అలాంటి పరిస్థితుల్లో పిండి వంటలు చేసుకుని ఇంటిళ్లపాదు ఆనందంగా కడుక్కునేందుకు ఉత్సాహం చూపుతారు. అలాంటి పిండి వంటలు కాల్చేందుకు ఉపయోగించు అమాంతంగా పెరగడంతో ప్రజలు పిండి వంటలు చేసుకుని పరిస్థితికి దూరమై ప్రత్యేక దుకాణాల్లో విక్రయిస్తున్న పదార్థాలను కొనుక్కొని వచ్చి పండగ జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పండుగ దెబ్బతో ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడం గమనార్హం. పండుగలో భాగంగా పూలు పండు ధరలు కూడా ఒక్కసారిగా ధరలు పెంచేసి సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే పండుగ కోసం హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను ఆర్‌టిసి, ప్రయివేట్ వాహనాల వారు ఎక్కువ రేట్లు పెంచి దోచుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ధరలు నియంత్రించి సామాన్యులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధరలు తగ్గించాలి

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఇంటికి బంధువులు వస్తూ ఉంటారు. దీనిని అదునుగా భావించి వ్యాపారులు, నిత్యావసర సరుకులు, కూరగాయలు అధిక రేట్లకు అమ్ముతున్నారు. పండగకు సరుకులు కొనాలంటే భయమేస్తుంది. గతంలో సంక్రాంతి పండుగకు చంద్రన్న కానుక ఇచ్చేవారు ప్రస్తుతం ఎవరు పట్టించుకోవడం లేదు.

- వి.సిద్దమ్మ, గృహణి, రాయచోటి.

పేదలను దోచుకుంటున్నారు..

ఏమి కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు. సంక్రాంతి సంబరాలు ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకులు, కూరగాయలు మార్కెట్‌లో అధిక రేట్లకు అమ్ముతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు రేట్లను నియంత్రించాలి. పేదవాడు పండుగ చేసుకోవాలంటే ప్రభుత్వం తక్షణమే ధరలు తగ్గించాలి. పేదల మార్కెట్లలో అధిక ధరలకు అమ్ముతూ పేదల దగ్గర దోచుకుంటున్నారు.

- సిరిపురి రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి,రాయచోటి.

కొత్త కాంతులు నింపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి నిలుస్తుందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక సంక్రాంతి నిలుస్తుందన్నారు. తెలుగు లోగిళ్లు శుభాలకు, సుఖ సంతోషాలకు నెలవు కావాలని, రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం కృషిచేస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తోందన్నారు. నియోజక వర్గ ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి భోగి, సంక్రాంతి,కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

డెమో ట్రైన్ లోకో ఫైలెట్లను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

డెమో రైలు రేణిగుంట వరకు పొడిగింపు

-హర్షం వ్యక్తం చేసిన నందలూరు ప్రజలు

ప్రజాశక్తి-నందలూరు

నంద్యాల నుంచి కడప వరకు ఉన్న డెమో రైలును రైల్వే అధికారులు 13 నుంచి రేణిగుంట వరకు పొడిగించడంతో శనివారం ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు డెమో రైలును స్వాగతించి లోకో ఫైలెట్లను పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ మెంబర్ కరీముల్లా ఖాన్, ఎజిపి షమీవుల్లాఖాన్‌లు మాట్లాడుతూ గతంలో నందలూరు రైల్వే కేంద్రంలో అన్ని వసతులు పుష్కలంగా ఉన్నాయని గుర్తించిన బ్రిటిష్ వారు నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే ఇంజిన్ రిపేర్ లోకోషెడ్‌తో పాటు అన్ని రైల్వే కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేశారని తెలిపారు. నందలూరులో అన్ని రైళ్లు నిలుపుదల చేసే వారని, దేశవ్యాప్తంగా కరోనా వ్యాప్తి చెంద డంతో నందలూరుతో పాటు పలుచోట్ల రైళ్ల నిలుపుదలను ఎత్తివేశారని తెలి పారు. మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఈ మధ్యకాలంలో రెండు రైళ్ల నిలుపుదల చేయడంతో పాటు డెమో రైలును రేణిగుంట వరకు పొడిగించడంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మండల ప్రజల తరపున హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చల పాటి నరసింహాశెట్టి, చోటానూర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి బాధ్యతలు

ప్రజాశక్తి-రామాపురం

రామాపురం ఎస్ఐగా బిఎల్.ప్రసాద్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. రాజంపేట టౌన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై రామాపురం వచ్చారు. రామాపురంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కొండారెడ్డి చాపాడు మండలానికి బదిలీ అయ్యారు. జిల్లాలో పలువురు ఎస్ఐలను ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీసు అధికారులు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. మట్కా, జూదం, దొంగ తనాలపై ఉక్కుపాదం మోపు తామని హెచ్చరించారు.

మతోన్మాద బిజెపి నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాజ్యాంగ హక్కులను మంట గలుపుతున్న మతోన్మాద బిజెపి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తలు, ప్రజలపై ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పేర్కొన్నారు. శనివారం స్థానిక బెంగళూరు రోడ్డులో గల కార్యాలయంలో పార్టీ నియోజకవర్గపు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పి.ఎల్.నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్పలు మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి దేశప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తోందని అన్నారు. నల్ల చట్టాలపై దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమంలో కేంద్రం ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి మద్దతిస్తున్న ప్రాంతీయ పార్టీలను ఓడించేందుకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్.బషీర్ ఖాన్, యస్.సలీం బాషా, డి.చిన్నరెడ్డప్ప పాల్గొన్నారు.

యువకులతో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-నందలూరు

నేటి యువత విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని రాజంపేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు ఆకాంక్షించారు.మండలం లోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రబ్బర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఫైనల్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, కమిటీ సభ్యులు మనీ, కాశి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, శివ, భార్గవ్, సుబ్రహ్మణ్యం, షంషీర్, వై సుబ్రహ్మణ్యం, సుబ్బు, అస్లాం, తల్మా,నవీన్ పాల్గొన్నారు.

రక్తదాతకు సర్టిఫికెట్‌ను ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని రాజుకుంట ఆరోగ్యఉపకేంద్రంలో ఐటి ఉద్యోగులు నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించింది. శనివారం నిర్వహించిన శిబిరంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని దాతలకు ప్రోత్సాహమిచ్చారు. రెడ్‌క్రాస్ సంస్థ సేకరించిన రక్తదాన శిబిరంలో యాభై మంది యువకులు పాల్గొనిరక్తదానం చేశారు. ముక్కా.రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేతతనయుడు సాయివికాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రక్తదానశిబిరాలు నిర్వహించాలని యువతకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సర్పంచ్ గుత్తినరసింహా, రెడ్‌క్రాస్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, కనకరాజు, ప్రభాకర్,రాజేష్,సుధీర్, ఇంతియాజ్ అహ్మద్, ప్రతాప్,మురళి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డు విలువను పెంచిన ప్రభుత్వం

ప్రొద్దుటూరు : పేదప్రజల ప్రయోజనార్థం జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు విలువను రూ.5లక్షల నుండి రూ.25లక్షలు పెంచిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం కొత్త డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ 3,257 వ్యాధులకు ఈ కార్డు చూపిస్తే ఉచిత వైద్యసేవలు అంది స్తారన్నారు. చికిత్స తీసుకున్న అనంతరం రోగి ఆర్థిక అవసరాలకు ఆరోగ్య ఆసరా పథకం కింద నగదును కూడా అందించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోరెడ్డి నశివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

'టికెట్' పోటీలో రాజకీయాలు

సినిమా టికెట్లతో ప్రజలకు వల

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ నాయకులు ప్రజలను ఆకర్షించి తద్వారా అధిష్టానం దగ్గర మార్కులు కొట్టేందుకు నానా తంటాలు పడుతున్నారు. రాజంపేట నియోజకవర్గంలో టిడిపి ఆశావహుల సంఖ్య అత్యధికంగా ఉండడంతో వారిలో ఓ ఆశావహ నాయకుడు గత రెండు నెలలుగా నియోజకవర్గ పరిధిలో గ్రామ గ్రామాన మహిళలకు చీరలు పంపిణీ, ఆలయాలు, మసీదులకు విరాళాలు అందజేస్తూ ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టణంలో అన్న క్యాంటీన్‌ను పునః ప్రారంభించి పట్టణ ప్రజలకు ప్రతిరోజూ ఉచిత భోజనాన్ని అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే

టిడిపి నాయకుడి పేరు, ఫొటోతో ఉన్న సినిమా టికెట్

ఉన్నా.. ఆ నేత మరో అడుగు ముందుకేసి సంక్రాంతికి ప్రతి ఇంటికి మహిళలకు ముగ్గుపిండి పంపిణీ చేపడుతున్నారు. ఇది కూడా పర్లేదను కోవచ్చు కానీ ముక్కున వేలేసుకొని ఔరా.. అనిపించేవిధంగా సంక్రాంతి పండుగను పురష్కరించుకొని మకర సంక్రాంతి రోజున సోమవారం రాజంపేట పట్టణంలోని అన్ని థియేటర్లలోనూ ప్రజలకు ఉచితంగా సినిమాలు చూపించనున్నారు. నాలుగు 'షో'లు ఉచితమేనని ఆయన పేరు, ఫోటో సినిమా టికెట్ల పై ప్రచురించి ఉచితంగా టికెట్లు ఏర్పాటు చేశారు. ఇదే విషయం గత రెండు రోజులుగా ఆ నేత వర్గీయులు, వ్యక్తిగత సహాయకులు సామాజిక మాధ్యమాలలో విపరీతంగా ట్రోల్ చేస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా అందరికీ చేరువయ్యేలా ప్రచారాలకు తెర లేపారు. కాస్త సామాజిక స్పృహ కలిగిన కొందరు ముక్కున వేలేసుకొని నవ్విపో తున్నారు. ఇదేం ప్రచార ఆర్భాటం రాబాబు అంటూ బుర్ర గోక్కుంటున్నారు. ఎన్నికల ప్రకటన విడుదలవక ముందే ఇలాంటి స్టంట్‌లు, ఫీట్లు చేస్తున్న నాయ కులకు టికెట్ దక్కితే మరెన్నీ విడ్డూరాలకు పాల్పడతారోనని నియోజకవర్గంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదీఏమైనా పార్టీ అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో వేచిచూడాలి

విద్యా హబ్‌గా మండల కేంద్రాన్ని తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రాన్ని విద్యాహబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని పూర్వ విద్యార్థి వైస్ ఎంపిపి-1 మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ కమిటీ చైర్మన్ మిట్టపల్లి రజిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డన్న, మెహిదీన్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆర్చి నిర్మాణానికి సహకరించిన వారందరిని పిలిపించి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యదు భూషణ్ రెడ్డి మాట్లాడుతూ 1962 -2024 విద్యాసంవత్సరాలను పరిశీలిస్తే బోధన కొట్టాలతో బండలపై కూర్చొని విద్యాభ్యాసం జరిగేదని అన్నారు. శెట్టిపల్లికి రోడ్డు క్లియర్ చేయడంతో ప్రహరి నిర్మాణానికి కూడా రూ.3లక్షలు పంపామని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రహరీ కూడా నిర్మాణానికి చేపడతానని హామీ నిచ్చారు. జూనియర్ కళాశాలకు రూ.8 కోట్లు మంజూరయ్యాయని, డిగ్రీ కళాశాల కూడా మంజూ రైంద న్నారు. మాజీ డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్ జయలక్ష్మి మాట్లాడుతూ తన భర్త ఇదే పాఠశాలలో చదువు కుని విద్యా బోధన చేసేవాడని ఆయన జ్ఞాపకార్థంగా సైన్స్ ల్యాబ్ ఖర్చుకు తన వంతు

విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. కొండ్రెడ్డి గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. అనంతరం విశ్రాంత ప్రధానో పాధ్యాయుడు మల్లన్న, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు మిట్టపల్లి వేద మూర్తిరెడ్డి, శెట్టి పాపయ్య, జెవివి మండల అధ్యక్షుడు కానాల శివారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌ను తలపిస్తున్న బస్టాండ్

బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ఆటోలు, ద్విచక్రవాహనాలు

ప్రజాశక్తి -కలకడ

మండల కేంద్రమైన కలకడ బస్టాండు ఆటో, స్కూటర్ స్టాండ్‌లను తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రమైన కలకడలో ఆర్‌టిసి బస్టాండు పరిసర ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు విరివిగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.ఎన్ని పర్యాయాలు పలు పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికి సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బస్టాండ్ ఆవరణంలో మల, మూత్ర విసర్జన గదులు లేకపోవడంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు అవస్థలలు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణంలో వేలకు వేలు పెట్టి గదులు తీసుకున్న వారు సైతం చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారం దుర్వాసనతో ముక్కున వేలు వేసుకోక తప్పడం లేదని యజమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణంలో కంట్రోలర్‌ను ఏర్పాటు చేసి ఆటోలు, ద్విచక్ర వాహనాలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అంధకారంలో ఆర్థిక పరిస్థితి : టిడిపి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంధకారంలో నెట్టేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాధనాయుడు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీవ్ర నేరారోపణలకు సంబం ధించి సిఎం జగన్‌పై 38 కేసులు నమోదయి ఉన్నాయని అన్నారు. 43 వేల కోట్ల రూపాయల దోపిడిపై సిబిఐ, ఇడి చార్జిషీట్లు కూడా దాఖలు చేశాయని తెలిపారు. ఈ కేసులకు సంబంధించి అత్యధికంగా 3500 వాయిదాలు తీసుకొని దేశంలోనే రికార్డ్ సృష్టించారని అన్నారు. నేరం చేయకపోతే శిక్ష పడుతుందనే భయం లేకపోతే కోర్టు విచారణలకు హాజరై తుది తీర్పు పొందవచ్చు కదా అని ప్రశ్నిస్తు న్నానన్నారు. జగన్ రెడ్డి ఒత్తిడితోనే సిబిఐ నమోదు చేసిన కేసుల్లో చంద్రబాబు వ్యక్తిగతంగా ఆర్థిక ప్రయోజనం పొందినట్టు సిఐడి ఎలాంటి ఆధారాలను కోర్టుకు చూపు లేకపోయిందని, హైకోర్టు వ్యాఖ్యానించి చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతమొంది, సంక్షేమ పాలన కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

సమావేశంలో పుల్లంపేట మండల పార్టీ అధ్యక్షులు ఆరే సుధాకర్ నాయుడు, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపా ధ్యక్షులు పులేల రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ కాపెర్ల చంద్రశేఖర్, నియోజకవర్గ ఆర్‌టిఎస్ కో-ఆర్డినేటర్ నవీన్‌కుమార్ శేఖర్, మనీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

రాజంపేట : నగదు బహుమతి అందజేస్తున్న అతికారి దినేష్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాజంపేట జనసేన పార్టీ ఆధ్వర్యంలో మన ఊరు..మనఆట వీర మహిళల సంక్రాంతి సంబరాలను శనివారం పలు మండలాలలో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా రాజంపేట జనసేన పార్టీ సమన్వయ కర్త అతికారి దినేష్, అతికారి కృష్ణ పాల్గొన్నారు. పట్టణంలోని మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోటీలలో పలువురు వీర మహిళలు వేసిన ముగ్గులు ఆకర్షించాయి. పోటీలను పర్యవేక్షించిన అనంతరం వారు మాట్లాడుతూ ఈ సంక్రాంతి ప్రతి కుటుంబంలో సంతోషాలను వెల్లి విరియాలన్నారు. ఇక వైసిపి పాలన ముగియడం తప్పదని రానున్నది జనసేన, టిడిపి పాలనేనని అన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ 20 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట, నందలూరు మండలాల జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో 'కస్తూరి'

చిట్వేలు: మండల పరిధిలోని కె.కందులవారిపల్లెలో శనివారం ఏర్పాటు చేసిన కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందులవారిపల్లె గ్రామానికి చెందిన యువ కులు సంక్రాంతి సందర్భంగా చిన్నతనం నుంచి చదువులు, ఉద్యోగాల అవసరాల నిమిత్తం పట్టణ జీవనానికి అలవాటు పడిన పాత జ్ఞాపకాలు గుర్తుతెచ్చుకుంటూ సంవత్సరానికి ఒక మారు గామంలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సంక్రాంతి సందర్భంగా గ్రామంలో యువకులు అందరూ ఇ టోర్నమెంట్ జరపడం తద్వారా గ్రామంలో స్నేహపూరిత వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గుండయ్య నాయుడు, పారిశ్రామికవేత్త విశ్వేశ్వర్ నాయుడు, రవీంద్ర నాయుడు, ఏదో టి రాజశేఖర్, శ్రీధర్ నాయుడు, బొంగటావుల రాజశేఖర్, న్యాయవాది బాలాజీ, వెంకటేష్ రాజు, నవీన్, అనంత యాదవ్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

సర్కిల్ కార్యాలయంలో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ఎస్‌పి కృష్ణారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో సమీక్ష నిర్వహించి నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందెం, పేకాట నిర్వహిస్తే దాడులు నిర్వహించి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు అతిగా మద్యం సేవించి ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. సమావేశంలో సిఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐలు గాయత్రి, రవీంద్రబాబు, లోకేష్ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు

ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఊకదంపుడు ఉపన్యాసాలు కాకుండా చేతల్లో చూపించే మంచి ప్రజాప్రతినిధిని రాబోయే ఎన్నికల్లో ఎన్నుకోవాలని ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి అన్నారు. ఆ మేరకు స్థానిక ప్రజాపక్షం కార్యాలయంలో శనివారం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరునికి ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ ఆయుధంలో చెడును రూపుమాపి మంచిని పెంపొందించే అవకాశం ఉందన్నారు. ఓటును సమాజం ఎంత బాగా సద్వినియోగం చేసుకుటుందో సామాజాభివృద్ధి అంతబాగా ఉంటుందన్నారు. విలువైన ఓటును డబ్బుకు అమ్ముకోవడం అంటే మన మన పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టడం లాంటిదే అన్నారు. ఉచిత పథకాలకు ఆకర్షితులు కావద్దన్నారు. మన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే రాజోలి, సిద్దేశ్వరం ప్రాజెక్టలను 75 ఏళ్లుగా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 2008లో రూ.150కోట్ల అంచనాలతో ప్రారంభమైన రాజోలి ప్రాజెక్ట్ అతీగతీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మన నీటి అవసరాలను తీర్చే శ్రీశైలం ప్రాజెక్ట్‌పై 1996లో జిఒనెం 69 విడుదలైందన్నారు. నీటి మట్టం 854 అడుగులు ఉండాల్సిందాన్ని 834 అడుగులకు కుదించేశారన్నారు. దీంతో 840 అడుగుల ఎత్తున్న పోతిరెడ్డిపాడు రిజర్వాయర్ నిర్వీర్యమైపోయిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం, కార్యదర్శి మునిసుబ్బారెడ్డి, సభ్యురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట నిలిచివున్న మురుగునీరు

మురుగునీరు పోయేందుకు దారేది?

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ సలాదికాలనీలో ఉన్న ఎంపిపి మెయిన్ పాఠశాల ముందు భాగంలో నిత్యం మురుగునీరు నిలిచి ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలోని చిలకలూరిపేట నుంచి మురుగు నీరంతా వచ్చి పాఠశాల ముందు చేరుతోంది. పాఠశాల చుట్టూ ఉన్న ప్రజలు తమ గృహాల ముందు నీరు నిల్వ ఉండకుండా ఎత్తు చేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలో అడుగు పెట్టాలంటే బురదనీటిలో తొక్కి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అరవీటివారిపల్లి, నాయనవారిపల్లి, చిలక లూరిపేట, ఉత్తరగడ్డ దళితవాడకు చెందిన ప్రజలందరూ ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మురుగునీటిని తొలగించే చర్యలు మాత్రం ఎవ్వరూ చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి మురుగునీరు తొలగించాలని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్త రోడ్డు నారాయణ పురానికి చెందిన టి.నాగేశ్వర్ ఇటీవల కంకర మిషన్ లో పనిచేస్తూ ఉండగా జెసిబి సామగ్రి అతని నడుముపై పడడంతో పూర్తిగా అనారోగ్యానికి గురి ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ, ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రేఖం నారాయణ, ఆయన కుమార్తె ఎంపిటిసి తులసి,. మనోజ్ కుమార్‌లు నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సాయం చేశారు.

క్రైం కార్నర్

స్వాధీనం చేసుకున్న దుంగలు, కారుతో అటవీశాఖ నిఘా విభాగం బృందం

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

అక్రమంగా తరలుతున్న రూ.9 లక్షలు విలువ చేసే ఆరు ఎర్రచందనం దుంగలతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీశాఖ సంచార దళ నిఘా విభాగం డిఎఫ్ఒ జెవి సుబ్బారెడ్డి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని తమకు అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బందిని రెండు బృందాలుగా మహల్ వద్ద ఒక బృందం, గుర్రంకొండ వద్ద మరో బృందం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. శనివారం తెల్లవారుజామున ఓ వాహనం మహల్ నుంచి వేగంగా రావడానికి గుర్తించి ఆపేందుకు ప్రయత్నం చేశామని తెలిపారు. ఆ వాహ నం ఆగకుండా పాపిరెడ్డిగారిపల్లి రోడ్డు వైపుకు వేగంగా వెళ్లడంతో అప్రమత్తమైన సిబ్బంది దాన్ని వెంబడించిందని అన్నారు. ఆ వాహనంలోని డ్రైవర్, మరో వ్యక్తి మంగళపల్లి సమీపంలో కారు ఆపి చీకట్లో పరార య్యారని పేర్కొన్నారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 180 కేజీల బరువు గల ఆరు ఎర్రచందనం దుంగలను గుర్తించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కారు ఎర్రచం దనం విలువ సుమారు రూ.9లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఒ ఎన్. వెంకట రమణ, ఎఫ్‌బిఒకె ప్రతాప్, ప్రొటెక్షన్ వాచర్లు ప్రభుతేజ, వెంకటేష్, డ్రైవర్ చరణ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ములకలచెరువు

యువతి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన పిటిఎం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు పిటిఎం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పిటిఎంకు చెందిన చాంద్‌బాషా కుమార్తె బి.కొత్తకోటలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుందని తెలిపారు.ఇటీవల జరిగిన పరీక్షలు సరిగ్గా రాయలేదని కుమిలి పోయేదని తెలిపారు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనం కొరకు తెచ్చిన పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుందని తెలిపారు. కుటుంబీకులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించి బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అనుమానస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన శనివారం పట్టణంలోని భవాని నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక భవాని నగర్‌లో కొంతకాలంగా అల్ఫియా,భర్తలు నివాసముంటున్నారని తెలిపారు. భార్యతో తరచూ భర్త గొడవ పడేవాడని, రాత్రి కూడా భార్య భర్తల మధ్య గొడవ పెద్దదై భార్యని హతమార్చి ఉంటాడనే అనుమా నాన్ని పోలీసులు వ్యక్తం చేశారు. రాయచోటి అర్బన్, రూరల్ సిఐలు సుధాకర్ రెడ్డి, తులసీ రామ్‌లు తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి ఇంటికి చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలను పోలీసులు పరిశీలించారు. అల్ఫియా మృతి పై అనుమానం ఉండటంతో మృతురాలి భర్తను పోలీ సులు అధుపులోకి తీసుకొని స్టేషన్లో విచారిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన మండలంలో చోటుచే సుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..స్థానిక దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురం సమీపంలో నడిమి చర్ల పంచాయతీ నడిమి చర్ల కొత్తపల్లి నుంచి సాంబశివ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంలో కలకడకు వస్తుండగా, కలకడ నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో సాంబశివకు ఎడమ కాలుకు రక్త గాయాలు అయ్యాయని తెలిపారు. గాయపడిన యువకుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లి

గత ఏడాది అక్టోబర్ 8,9వ తేదీల్లో స్థానిక కోర్టులోని గంగమ్మ ఆలయంలో జరిగిన చోరీకి సంభందించి నిందితుడు ఎల్లుట్ల భాను ప్రకాష్ అలియాస్ ప్రకాష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. అన్నమయ్య సర్కిల్‌లో తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులను చూసి కంగారుగా పారిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోనికి తీసుకుని విచారించామన్నారు. అతడు గత సంవత్సరం చేసిన దొంగతనం నేరం అంగీకరించాడని తెలిపారు. నిందితుడి సొంత గ్రామం తంబళ్లపల్లె కాగా మదనపల్లె లోని దొంతి వీధిలో నివాసముంటున్నాడని చెప్పారు. చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. నిందితుడిపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయన్నారు. అతని నుంచి రూ.25వేలు నగదు, అమ్మవారి కళ్లు, కుంకుమ భరిణలతో పాటు 45 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించిందని తెలిపారు. కేసుని ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని డిఎస్‌పి కేశప్ప, సిఐ వల్లిబసులు అభినందించారు.